క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా గొల్లపూడి



గొల్లపూడి సాయికుమార్

తెర్లాం: బీజేపీ మండల అధ్యక్షుడిగా గొల్లపూడి సాయికుమార్‌ను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదే విషయాన్ని ఆయనే స్వయంగా ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టిన పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు



ఎంపీడీవో రాంబాబు

తెర్లాం: వేసవి ఎండల నేపథ్యంలో ఎక్కడా తాగు నీటి ఇక్కట్లు లేకుండా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రేగి రాంబాబు తెలిపారు. ఇదే విషయమై విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడైన బోర్లు, మరమ్మతులకు గురైన బావులను బాగు చేసేందుకు ఇప్పటికే క్రాస్‌ప్రోగ్రాం ప్రారంభించామన్నారు. ఎక్కడ బోరు పనిచేయకపోయినా, రక్షిత మంచినీటి పథకం గానీ బావులు గానీ వినియోగంలో లేకపోయినా తమకు సమాచారం ఇస్తే సిబ్బందిని పంపించి బాగు చేయిస్తామన్నారు. ఫోన్ నంబర్లు 8332908770, 9949337492, 9963616062ను సంప్రదిస్తే 24 గంటల్లో తాగునీటి వనరులు బాగుచేసి, నీటి సరఫరా పునరుద్ధరణ చేయడం జరుగుతుందన్నారు.

పరామర్శ



రామకృష్ణంనాయుడును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వావిలపల్లి రామకృష్ణంనాయుడు(బాల).. ఇటీవల అనారోగ్యం బారినపడి హైదరాబాద్‌లో చికిత్స అనంతరం గ్రామానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావులు గురువారం ఆయనను కలిసి పరామర్శించారు. ఆరోగ్యం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోనెల ప్రసాద్, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

వంగర: మండలంలోని మద్దువలస 11 కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలను ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలు తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. సంగాం, ఓనెఅగ్రహారం, మగ్గూరు, మెట్టమగ్గూరు గ్రామాలకు ఈ అసౌకర్యం కలగనుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

బాడంగి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీ వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే వారంతా ఆన్‌లైన్‌లో గానీ పాఠశాలకు నేరుగా వచ్చి గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను ఆయన కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బొబ్బిలిరూరల్: అక్రమంగా తరలిస్తున్న 600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. మండలంలోని పిరిడి గ్రామానికి చెందిన రాపాక శ్రీనివాసరావు అనే వ్యక్తి గ్రామం నుంచి ఒడిశాకు ఆటోలో తరలిస్తుండగా విజిలెన్స్, రెవెన్యూ అధికారులకు పట్టుబడ్డాడు. 12 బియ్యం బస్తాలు సహా ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ తెలిపారు.

తూకంలో తేడాలొస్తే కఠిన చర్యలు

రాజాం సిటీ: వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు తూకంలో తేడాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ అధికారులు దామోదర్‌నాయుడు, బలరాంకృష్ణలు హెచ్చరించారు. స్థానిక పట్టణంలో పండ్ల వ్యాపారుల బళ్ల వద్ద కాటాలను వారు గురువారం తనిఖీ చేశారు. అవకతవకలకు పాల్పడుతున్న పది మందిపై కేసులు నమోదు చేసి వారి కాటాలు సీజ్ చేశారు. తూనికల్లో మోసాలపై తరచూ వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు వారు తెలిపారు.

మహిమాన్వితం.. చిన్నమ్మ క్షేత్రం!



చిన్నమ్మ తల్లి ఆలయం



చిన్నమ్మ వారాల పండగలో భక్తులు(ఫైల్)

- భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా రామభద్రపురం చిన్నమ్మతల్లి ప్రసిద్ధి
- మూడు శతాబ్దాలుగా పూజలందుకుంటున్న అమ్మవారు
- ఈ నెల 10, 11, 12 తేదీల్లో జాతర మహోత్సవాలు
- రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో రానున్న భక్తులు

రామభద్రపురం: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా రామభద్రపురం చిన్నమ్మతల్లి ప్రసిద్ధి. విజయనగరం పైడితల్లి, శంబర పోలమాంబ, రాయగడ మజ్జిగౌరమ్మ ఆలయాల మాదిరిగానే ఇక్కడి ఆలయానికి కూడా వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ప్రత్యేక పూజలు, విశేషార్చనలు చేసి తమ మొక్కులు తీర్చుకుంటారు. ఏటా మార్చి 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే ఇక్కడ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అమ్మవారి దర్శనార్థం వస్తుండడం విశేషం. ఎంతో మహిమ గల ఈ అమ్మవారిని దర్శించుకుంటే ఉద్యోగ, వృత్తి, వ్యాపార రంగాల్లో రాణిస్తామనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. రామభద్రపురం వాసులైతే తాము చేసే ఏ పనిలోనైనా మంచి జరగాలంటే అమ్మవారి ఆశీస్సులు ఉండాలని భావిస్తారు. ప్రతి మంగళవారం పదుల సంఖ్యలో అమ్మవారి వారాల పండగ చేస్తారు. ఆలయం వైపుగా వెళ్లే వాహనదారులు కూడా అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి, ఆశీస్సులు తీసుకుని మరీ తమ ప్రయాణం సాగిస్తారు.

● మూడు వారాల పాటు..

చిన్నమ్మకు ఏడాదంతా నిత్య పూజలు, వారాల పండగలు జరుగుతూనే ఉంటాయి. ప్రతి ఏటా శివరాత్రి సమయంలో మూడు వారాల పాటు వారోత్సవాలు నిర్వహించి, ఆ తర్వాత మూడు రోజుల పాటు అమ్మవారి పండుగ నిర్వహిస్తారు. ఈ సమయంలో అమ్మవారి దర్శనానికి భక్తులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులంతా పోటీపడుతుంటారు.

● అమ్మవారి చరిత్ర.. ఆసక్తికరం..

మూడడ్ల ఇంటి పేరున్న వారింట్లో ఆవిర్భవించిన చిన్నమ్మవారు పుట్టుక వెనక ఓ ఆసక్తికరమైన కథనం ప్రచారంలో ఉంది. తొమ్మిదో తరానికి చెందిన వృద్ధురాలు మూడడ్ల చిన్నమ్మి, వంగపండు సూర్యనారాయణ పెద్దలు చెప్పిన ప్రకారం దాదాపు మూడు వందల ఏళ్ల క్రితం రామభద్రపురానికి చెందిన మూడడ్ల వారింట్లో మజ్జిగ చిలుకుతున్నప్పుడు ఆ మజ్జిగలో అమ్మవారి ప్రతిమ బయటపడింది. ఆ కుటుంబీకులు ఆ ప్రతిమను పట్టించుకోకుండా అటక మీద పడేసి పొలం పనులకు వెళ్లిపోయారు. ఒకరోజు ఆ గ్రామంలో మూడడ్ల వారి వీధి గుండా గాజుల వ్యాపారులు గాజులోయమ్మ గాజులూ.. అంటూ కేక వేసుకుంటూ వెళ్లిపోతున్నారు. అదే సమయంలో మూడడ్ల వారింటి నుంచి ఓ యువతి వచ్చి గాజులు వాడిని పిలిచి గాజులు వేయించుకుని డబ్బుల కోసం మళ్లీ రమ్మని చెప్పింది. వెనుదిరిగిన గాజుల వ్యాపారులు తిరిగి వచ్చేటప్పటికి మూడడ్ల కుటుంబీకులు ఇంట్లో ఉన్నారు. ఆ ఇంట్లో నుంచి వచ్చిన యువతి గాజులు వేయించుకుని, డబ్బులు ఇవ్వలేదని డబ్బుల కోసం వచ్చానని ఆ వ్యాపారులు చెప్పగా, వారు విస్తుపోయారు. తమ ఇంట్లో అమ్మాయిలే లేరని, గాజులు కొనడం అబద్ధమని వాదించారు. దీంతో గాజుల వ్యాపారులు తిట్లు లంకించుకుని వెనుదిరిగేవారు. ఇంతలో మూడడ్ల వారి ఇంట్లో ప్రతిమను ఉంచిన అటకపై నుంచి విరిగిన గాజులు కింద పడ్డాయి. ఇది అమ్మవారి మహత్యమేనని విశ్వసించిన వారు ఆ ప్రతిమను తీసుకెళ్లి గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఈతచెట్టు కాగుచెట్టు కలిసి ఉన్న చోట గుడి కట్టి ఆ గుడిలో అమ్మవారి ప్రతిమ పెట్టారు. తమ ఇంట్లో ఆడపిల్లలు లేకపోవడంతో తమ ఆడపిల్లగా భావించి, ఆ ప్రతిమకు చిన్నమ్మ అని పేరు పెట్టి పూజలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ తల్లి పూజలందుకుంటోంది.

ఆలయ అభివృద్ధి పట్టించుకునే వారేరి..?

దశాబ్దాల కాలంగా ప్రభుత్వాలు, పంచాయతీ పాలకులు మారుతున్నారే తప్ప ఇంతటి ప్రసిద్ధి చెందిన అమ్మవారి ఆలయం అభివృద్ధి పట్టించుకునే వారే కరువయ్యారు. ఏటా పండగ నిర్వహణకు గ్రామపెద్దలు శివాలయంలో సమావేశమై, పండుగ నిర్వహణతో పాటు ఆలయ అభివృద్ధికి ఆలోచన చేయడమే తప్ప ఆచరణలో కనిపించడం లేదు. పండగ నిర్వహణ అనంతరం అభివృద్ధి గురించి మర్చిపోయే పరిస్థితి ఉంది. మళ్లీ పండగ జరిగే సమయంలోనే ఆలయాన్ని అభివృద్ధి చేస్తే బాగుణ్ను అనే ఆలోచనలు అందరి నోటా పుట్టుకొస్తాయని, ఆ దిశగా చిత్తశుద్ధి కొరవడిందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

ఆరుబయట మద్యం తాగితే కేసులు



వంగర పోలీస్‌స్టేషన్ సిబ్బందితో ముచ్చటిస్తున్న డీఎస్పీ రాఘవులు

వంగర: ఆరుబయట మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించి, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, కేసుల నమోదు వంటి అంశాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు కృషి చేయాలని, సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా విద్యార్థులు, యువతను చైతన్యం చేయాలని తెలిపారు. ప్రజలతో కఠినంగా కాకుండా కాస్త స్నేహంగా ఉంటే విధుల నిర్వహణ సులభంగా ఉంటుందన్నారు. ఆయన వెంట రాజాం రూరల్ సీఐ హనుమంతు ఉపేంద్రరావు, ఎస్‌ఐ షేక్ శంకర్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

మెంటాడ: బాలికల సంరక్షణ కోసం రూపొందించి అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి అన్నారు. స్థానిక కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని గురువారం సందర్శించిన ఆమె.. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, వారి అభ్యసన సామర్థ్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం బాలికల సంరక్షణ చట్టాలను తెలిపి, వాటి ద్వారా ఏ విధంగా రక్షణ పొందవచ్చో తెలిపారు. 14 ఏళ్ల వయసులోపు బాలలను పనిలో పెట్టుకోకూడదన్నారు. బాలలంతా తప్పనిసరిగా ఉచిత నిర్బంధ విద్యను పొందాలన్నారు. అనంతరం సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఆకతాయిల నుంచి తమను తాము ఏ విధంగా కాపాడుకోవాలో బాలికలకు తెలిపారు. ఆమె వెంట గజపతినగరం సీఐ రమణ, ఆంధ్ర ఎస్‌ఐ కె.సీతారాం, ప్రిన్సిపాల్ శారద తదితరులు ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయండి



రాజాం: గురవాంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

రాజాం: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తేనే రోజుకు రూ.300 గిట్టుబాటు అవుతుందని ఏపీవో సాయిరాం అన్నారు. మండలంలోని గురవాం, ఒమ్మి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పని చేసిన వారికే మస్తరు వేయాలని, పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని వావిలవలస, అంబఖండి, సోమరాజుపేట, లింగాలవలస, తాటిపాడు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ఎస్.హరనాథ్ పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయాల్లో పనులు చేసుకోవాలని తెలిపారు. అలా అయితేనే వేసవి ఎండల బారినపడకుండా ఉండగలమన్నారు.

సంతకవిటి: మండలంలోని గరికిపాడు గ్రామంలో రైతు కె.కాంతమ్మ పొలంలో జరుగుతున్న ఫారంపాండ్‌ల నిర్మాణ పనులను ఏపీవో ఆర్.హరనాథరావు పరిశీలించారు. భూ గర్భజలాల సంరక్షణకు ఈ ఫారంపాండ్‌ల నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 9 మీటర్ల పొడవు, 9 మీటర్ల వెడల్పు కలిగిన ఫారంపాండ్‌లను నిర్మిస్తే 80 పనిదినాలకు గాను రూ.25 వేలు అందించడం జరుగుతుందన్నారు. మండలానికి 300 నుంచి 500 వరకు ఫారంపాండ్‌ల నిర్మాణానికి అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు.

ఆశ కార్యకర్తల ఆందోళన



తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా ఆశ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బొబ్బిలి తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పనిభారం తగ్గించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ఇవ్వాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు ప్రకటించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందివ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమ పదవీ విరమణ వయసు కూడా 62 ఏళ్లకు పెంచాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాంతి, లక్ష్మి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

– బొబ్బిలి రూరల్

పోలీస్‌స్టేషన్‌కు 'పది' ప్రశ్నపత్రాలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు వంగర పోలీస్‌స్టేషన్‌కు గురువారం చేరుకున్నాయి. కస్టోడియన్, జాయింట్ కస్టోడియన్ ఆనందరావు, సత్యనారాయణలతో పాటు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డీవోల సమక్షంలో వాటిని స్టేషన్‌కు చేర్చి, భద్రపరిచారు. ఈ నెల 17వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, అప్పుడే వాటిని పరీక్ష కేంద్రాలకు తరలించనున్నారు.

– వంగర



చెరువు గట్టు దిబ్బ చదును చేసేశారు..



బాడంగి మండలం, మల్లపేట రెవెన్యూ పరిధి, పూడివలస గ్రామ సర్వే నంబరు 104/18లోని జామేరు చెరువు గట్టు దిబ్బను ఆక్రమించుకుని, చదును చేసేశారు. ఇదే విషయంపై ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పూడి బాలకృష్ణ.. మూడు రోజుల క్రితం తహసీల్దారు సుధాకర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆక్రమణకు గురైన చెరువు గట్టు దిబ్బ ప్రభుత్వానిదా లేకపోతే సర్పంచ్‌దా తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. తమ తాతముత్తాతల నాటి దగ్గర నుంచి చెరువు గట్టు దిబ్బ అలానే ఉండేదని, తమ గ్రామ సర్పంచ్ మాత్రం ఆయన పొలం పక్కనే చెరువు గట్టు దిబ్బ ఉండడంతో దానిని జేసీబీతో చదును చేసి పొలంలో కలుపుకున్నారని ఆరోపించారు. ఆక్రమణపై దర్యాప్తు చేసి, ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని బాలకృష్ణ కోరారు. తహసీల్దారును సైతం ఇదే విషయంపై సంప్రదించగా, ఫిర్యాదు అందిందని శుక్రవారం క్షేత్రస్థాయికి వెళ్లి, వాస్తవ పరిస్థితులపై నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

– బాడంగి

ఎట్టకేలకు రోడ్డు విస్తరణ పనులు



రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

రాజాం: స్థానిక గాయత్రి కాలనీ రోడ్డుకు సంబంధించి, బొబ్బిలి కూడలిలో ఎట్టకేలకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గతేడాది కాలంగా ఇక్కడి రోడ్డు విస్తరణకు సంబంధించి, కాలువల నిర్మాణాలు చేసేందుకు పలువురి నిర్మాణాలు అడ్డంకిగా మారాయి. ఇటీవల రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఈ పనులపై ప్రత్యేక దృష్టిసారించారు. అటు అంబేడ్కర్ జంక్షన్, ఇటు బొబ్బిలి జంక్షన్‌ల వద్ద నిర్వాసితులతో మాట్లాడి, రోడ్డు నిర్మాణాలకు అడ్డంగా ఉన్నవాటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్యాలయ టీపీవో తేజేశ్వరరావు ఈ పనులను పర్యవేక్షించారు.

మహిళలకు సత్కారం



తెర్లాం: ఐసీడీఎస్ పీవో, సూపర్‌వైజర్, సర్పంచ్‌లను సన్మానిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తెర్లాం/బొబ్బిలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తెర్లాం మండలంలోని పెరుమాళి, బొబ్బిలి ఐసీడీఎస్ కార్యాలయంలో మహిళలను గురువారం సత్కరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెరుమాళిలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళలపై లింగవివక్ష చూపొద్దని, అన్ని రంగాల్లో రాణించేలా మహిళలను ప్రోత్సహించాలని మహిళలంతా కోరారు.

రాజాం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణానికి చెందిన వాసవీ క్లబ్ వనితా శక్తి సభ్యులంతా కలిసి డోలపేటకు చెందిన ప్రముఖ రంగస్థల కళాకారిణి ఎ.గౌరీని గురువారం సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనితాశక్తి ప్రెసిడెంట్ శ్రీదేవి, కార్యదర్శి కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

బొబ్బిలి: స్థానిక కోర్టు సముదాయంలో ఈ నెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసి మరీ కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బెంచ్‌లో తనతో పాటు న్యాయవాది కె.శైలజ ఉంటారని, రెండో బెంచ్‌లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, న్యాయవాది పెంట జగన్నాథంలు ఉంటారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులను కోరారు.

రాజాం సిటీ: స్థానిక సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయంలో ఈ నెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. రాజీకి అనుకూలమైన అన్ని సివిల్, క్రిమినల్, ప్రీ–లిటిగేషన్ కేసులను పరిష్కరించనున్నామన్నారు. కక్షిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దంపతులకు వినూత్న బహుమతి



మొక్కలు అందజేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

రాజాం: స్థానిక వైఎస్సార్ పార్కు వద్ద ఇప్పిలి శ్రీనివాసరావు, ప్రసన్న దంపతుల వివాహ వార్షికోత్సవానికి పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు హాజరై, ఆ దంపతులకు వినూత్న బహుమతి ప్రదానం చేశారు. గురువారం జరిగిన ఆ కార్యక్రమానికి ఆ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు వెళ్లి, రెండు మొక్కలను గిఫ్ట్(బహుమతి)గా అందజేశారు. అనంతరం దంపతులతో వాటిని పార్కులో నాటించారు. ఆ మొక్కలు పెరిగి పెద్దయ్యేంత వరకు బాధ్యత వహించాలని కోరారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, రాజాం పట్టణంతో పాటు రాజాం పరిసర ప్రాంతాల్లో పచ్చదనమే లక్ష్యంగా ఉచితంగా మొక్కలు అందజేసి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు నాయుడు తెలిపారు. వాటిని ఆ దంపతులతో ఆ పార్కులో నాటించారు. వారు కూడా ఈ మొక్కలతో పాటు పర్యావరణ పరిరక్షణ నిమిత్తం రూ.1000లు కమిటీకి అందించారు.

భూ ఆధార్ తప్పనిసరి

రాజాం సిటీ: రైతులంతా భూ ఆధార్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో ఎం.రేణుకాసాయి తెలిపారు. మండలంలోని పొగిరి రైతు సేవా కేంద్రంలో చేపడుతున్న భూ ఆధార్ నమోదు ప్రక్రియను ఆమె గురువారం పరిశీలించారు. ఈ నెల 10వ తేదీ వరకు నమోదు చేసుకునేందుకు గడువు ఉందని, రైతులంతా త్వరగా భూ ఆధార్ చేయించుకోవాలని కోరారు. భూ ఆధార్ చేయించుకున్న వారికి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్ వంటి పథకాలు అందుతాయని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధించి, ఆధార్ కార్డు, పట్టదారు పాసుపుస్తకం/ వన్‌బీ, ఆధార్‌కు లింకు అయిన మొబైల్ నంబర్ తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలన్నారు.

సంక్షిప్తంగా...

సర్వేపై ఎంపీడీవో ఆరా

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈపీ4 సర్వేపై ఎంపీడీవో ఎస్.రామకృష్ణ గురువారం ఆరాతీశారు. పీ4 అనగా పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ అని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సర్వే చేయడం జరుగుతోందని ఆయన అన్నారు. అట్టడుగువర్గాల వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి ఈ సర్వే దోహదం చేస్తుందన్నారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని కోరారు.

మౌలిక వసతుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

బొబ్బిలిరూరల్: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వరరావు తెలిపారు. స్థానిక పట్టణంలోని తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశమైన ఆయన.. కాలనీల్లో వేసిన రోడ్లు, కాలువలు, స్తంభాలు, ఏర్పాటు చేసిన బోర్లకు అయిన ఖర్చు అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులకు ప్రకృతి సేద్యం చేయాలని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు రైతులకు తెలిపారు. అనంతరం ఘన, ద్రవ జీవామృతాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ రమణ, సర్పంచ్ కరణం గోవిందరావు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, అంబాడ వెంకటాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగించుకోవాలని అలా అయితే పంటలు బాగుండడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

బొబ్బిలిరూరల్: క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సీహెచ్‌వో అనూష కోరారు. మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో క్షయవ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. తగ్గని దగ్గుతో బాధపడితే కఫం పరీక్షలు చేసుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే వైద్యుల సలహాలు, సూచనలతో కొన్ని వారాల్లోనే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. అనంతరం గ్రామస్తులతో వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జి.దేవి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు

రేగిడి: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు గురువారం అందించారు. ఇక్కడ చేసిన మాదిరిగానే ఇంట్లో కూడా ఫిజియోథెరపీ చేసుకోవాలని వైద్యురాలు రమాచంద్రికా తెలిపారు. ప్రతిరోజూ ఫిజియోథెరపీ చేయడం ద్వారా వైకల్యం అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు, సహిత విద్య ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, టి.రాజేష్ పాల్గొన్నారు.